ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు
727మంది గైర్హాజరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. తెలుగు, ఒరియా, సంస్కృతం పేపరు-2 పరీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 109 పరీక్షా కేంద్రాల్లో 26,118 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 727మంది గైర్హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 24,241 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 664 మంది గైర్హాజరయ్యారు. 23,577 మంది హాజరయ్యారు. 1877 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 63 మంది గైర్హాజరయ్యారు. 1814 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

సాగునీటిపై చిన్నచూపు

- బడ్జెట్ ప్రతిపాదనల్లో నాలుగోవంతు కేటాయింపు
- ప్రస్తావన లేని కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నిధుల అంశం
- ట్రిపుల్ ఐటి, అంబేద్కర్ యూనివర్సిటీకి మొండిచేయి
- కొత్తగా ఒక్కప్రాజెక్టూ ప్రకటించని ప్రభుత్వం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను అసెంబ్లీలో గురువారం ప్రవేశపెట్టారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి కావాల్సిన మేర నిధులు కేటాయిస్తుందేమోనని ఎదురుచూసిన జిల్లావాసులకు బడ్జెట్ నిరాశనే మిగిల్చింది. అధికారులు పంపిన ప్రతిపాదనలకు, ప్రభుత్వం కేటాయించిన నిధులకు అసలు పొంతనే లేదు. ప్రాజెక్టులకు నామమాత్రంగా నిధులు విడుదల చేసి చేతులు దులుపుకుంది. ఇతర అభివృద్ధి ప్రాజెక్టు అంశం కూడా ప్రస్తావనకు రాలేదు. పలాసలోని కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రికి నిధులు కేటాయించలేదు. ట్రిపుల్ఐటి, బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీకి నిధులు ఇవ్వకపోవడం జిల్లావాసులను నిరాశపరిచింది.

జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు విషయంలో ప్రభుత్వం చిన్నచూపు చూసింది. వంశధార సర్కిల్ పరిధిలోని ప్రాజెక్టుకు రూ.763.12 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ప్రభుత్వం మాత్రం బడ్జెట్‌లో రూ.193.98 కోట్లు మాత్రమే కేటాయించింది. వంశధార ప్రాజెకు-1కు రూ.56.56 కోట్లు కావాలని అడగగా, ప్రభుత్వం కేవలం రూ.3.89 కోట్లే ఇచ్చింది. వంశధార ప్రాజెక్టు ఫేజ్-2 స్టేజ్-2కు రూ.476.54 కోట్లు అవసరమని ప్రతిపాదించగా, రూ.180.73 కోట్లు కేటాయించింది. ఇందులో పనుల కోసం రూ.110 కోట్లు, భూసేకరణకు రూ.85 లక్షలు కేటాయించింది. ఆర్ అండ్ ఆర్ చెల్లింపులు, పనుల కోసం రూ.69.89 కోట్లు కేటాయించింది. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టుకు రూ.231 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపగా రూ.9.36 కోట్లు కేటాయించింది. ఇందులో పనుల కోసం రూ.7.55 కోట్లు కేటాయించగా భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చెల్లింపుల కోసం రూ.1.81 కోట్లను కేటాయించింది. మడ్డువలస రెండో దశ పనులకు రూ.26 కోట్లతో ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం రూ.17.57 లక్షలనే ఇచ్చింది.

వ్యవసాయ లేబొరేటరీల ఏర్పాటు

బడ్జెట్‌లో ప్రభుత్వం వ్యవసాయానికి కొంత ప్రాధాన్యం ఇచ్చింది. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల పరీక్షలకు లేబొరేటరీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లాస్థాయిలో ఒక లేబొరేటరీ నిర్మించాలని ప్రతిపాదించింది. ఇప్పటికే అందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెప్పారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలతో పాటు జిల్లా కేంద్రంలో ఒక ల్యాబ్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.247 కోట్లు కేటాయించింది. ఇందులో జిల్లాకు సుమారు రూ.కోటి మేర రావచ్చని అంచనా వేస్తున్నారు.

బడ్జెట్‌లో 'బుడగట్లపాలెం' ప్రస్తావన

ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ప్రతిపాదిత ఫిషింగ్ హార్బర్ అంశాన్ని ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రస్తావించింది. ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించింది. సాగరమాల ఫేజ్-2లో భాగంగా 40 ఎకరాల్లో దీన్ని నిర్మించనున్నారు. హార్బర్ నిర్మాణానికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అన్నిరకాల అనుమతులు ఇచ్చింది. రూ.332 కోట్లతో నిర్మించనున్న హార్బర్‌కు కేంద్ర ప్రభుత్వమే నిధులు సమకూర్చనుంది. హార్బర్ నిర్మాణం పూర్తయితే వేలాది మంది మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని అధికారులు చెప్తున్నారు.

ఆసరా చెల్లింపులకు బడ్జెట్‌లో నిధులు

జిల్లాలో 38,647 సంఘాల్లోని 4,31,734 మంది సభ్యులు ఆసరా ద్వారా తొలి విడతగా లబ్ధి పొందారు. రెండో విడతలో 38,805 సంఘాల నుంచి 4,18,397 మంది అర్హత సాధించారు. వారికి రూ.282.36 కోట్లను ఇచ్చారు. మూడో విడత డబ్బులు ఇప్పటివరకు జమ కాలేదు. గతేడాది డిసెంబర్‌లోనే అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వెలుగు ఎపిఎంలు, సిసిలు, విఒఎలు గ్రామాల వారీగా ఇకెవైసి పూర్తి చేశారు. మూడో విడత ఆసరాకు 38,804 సంఘాల్లోని 4,18,393 మంది ఎదురుచూస్తున్నారు. వీరికి రూ.284 కోట్లు అవసరమని గుర్తించారు. ప్రభుత్వం తాజాగా బడ్జెట్‌లో రూ.6,700 కోట్లు కేటాయించింది. త్వరలో వీరి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని పేర్కొంది.

యాంత్రీకరణ ముందుకు సాగేనా?

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు ట్రాక్టర్లు, పంటకోత మిషన్లు, ఇతర పనిముట్లు అందించాలని గతేడాది నిర్ణయించింది. ఇందుకోసం 325 రైతుభరోసా కేంద్రాల్లో 2022 జూన్‌లో మెగా మేళా నిర్వహించి 236 ట్రాక్టర్లు, పంటకోత యంత్రాలు, ఇతర పనిముట్లను ప్రభుత్వం అందించింది. నిధులు విడుదల చేయకపోవడంతో మిగిలిన ఆర్‌బికెల పరిధిలోని రైతులకు ఇవ్వలేదు. ప్రభుత్వం తాజాగా బడ్జెట్‌లో రూ.1212 కోట్లు కేటాయించడంతో 331 ఆర్‌బికెల పరిధిలోని రైతులకు వ్యవసాయ పరికరాలు అందే అవకాశం ఉంది.

ప్రజా సమస్యలు పట్టలేదు

బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి, ఇరిగేషన్‌కు పెద్దగా కేటాయింపులు లేవు. అంకెలతో గారడీ చేశారే తప్ప సామాన్య ప్రజలకు ఉపయోగపడే బడ్జెట్ కాదు. రాష్ట్రంలో ఎందరో విద్యావంతులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. వారికి ఉపాధి అవకాశాలు పెరిగేలా ఈ బడ్జెట్‌లో ఎటువంటి నిర్ణయాలు తీసుకోక పోవటం బాధాకరం.

- బలగ శ్రీరామ్మూర్తి, సిపిఐ జిల్లా కార్యదర్శి

ఇది గారడీ బడ్జెట్

రాష్ట్ర బడ్జెట్లో సంక్షేమ పథకాలకు పెద్దపీట వేశారు. రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకునే వైసిపి ప్రభుత్వం బడ్జెట్లో రైతులకు మొండి చేయి చూపింది. నిరుద్యోగ భృతి ఊసే లేదు. లా నేస్తం పథకానికి కేటాయింపులు లేవు. ఇది ఒక రకంగా యువతను మోసగించడమే. ఇది గారడీ బడ్జెట్.

-బి.మోహనరావు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు

సంక్షేమ బడ్జెట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తోంది. విద్య, వైద్యం, సంక్షేమం, వ్యవసాయం, పారిశ్రామికాభివృద్ధి, తీర ప్రాంతంలో పోర్టుల నిర్మాణం వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకోవడం జరిగింది. ఆ దిశగా బడ్జెట్ రూపకల్పన చేశారు.

- ధర్మాన కృష్ణదాస్, వైసిపి జిల్లా అధ్యక్షులు

కేటాయింపులు సరే నిధులు ఎక్కడ?

ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉన్న వైసిపి ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా చూపింది. గత బడ్జెట్‌లో ఇచ్చిన కేటాయింపులకే ఇంతవరకు నిధులు ఇవ్వలేదు. కాట్రగడ రిజర్వాయర్ అన్నారు. పాత ప్రాజెక్టుకు గత బడ్జెట్‌లో లెక్కలు చూపారే తప్ప నిధులు ఇవ్వలేదు. ప్రతి బడ్జెట్ సమావేశాల్లోనూ కేటాయింపులు చూపినా వాటికి ఎక్కడి నుంచి డబ్బులు వస్తాయో చెప్పడం లేదు.

- కూన రవికుమార్ , టిడిపి జిల్లా అధ్యక్షులు

అభివృద్ధి నిల్.. అప్పులు ఫుల్

రాష్ట్ర బడ్జెట్ అభివృద్ధి నిల్.. అప్పులు ఫుల్ అన్నట్లు ఉంది. రైతు భరోసా మొత్తాన్ని రూ.13,500 నుంచి రూ.25వేలకు పెంచాలి. రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయానికి తగిన ప్రోత్సాహం లేదు. ఇరిగేషన్‌కు నిధులు నామినల్‌గా పెరిగాయి. గ్రామీణ ఉపాధి హామీ చట్టం బకాయిల చెల్లింపు ప్రస్తావనే లేదు. సిపిఎస్ రద్దు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ చర్చ లేదు.

- డి.గోవిందరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రాజెక్టులకు నిధులేవి?

రైతులను పూర్తిగా పట్టించుకో లేదు. నాలుగేళ్లలో ఏ ఒక్క ప్రాజెక్టుకు పైసా నిధులు ఖర్చు చేసిన దాఖలాలు లేవు. రోడ్లపై తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదు. కేటాయింపులు ఇచ్చిన ప్రభుత్వం ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేస్తున్నారో చెప్పాలి.

- బొడ్డేపల్లి సత్యవతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు

వ్యవసాయరంగానికి ఏమూలకూ సరిపోదు

వ్యవసాయరంగానికి గత ఏడాది కేటాయించిన నిధుల కంటే రూ.2వేల కోట్లు తగ్గించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తికి తగిన నిధులు విడుదల చేయలేదు. ధరల స్థిరీకరణ నిధిని రూ.3వేల కోట్లు కేటాయించారు. ఇది ఏ మూలకూ సరిపోదు. 62శాతం మంది వ్యవసాయరంగంపై ఆధారపడి ఉన్నారు. ఈ రంగానికి కనీసం బడ్జెట్‌లో 15శాతం నిధులు కేటాయించాలి.

- కె.మోహనరావు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

నర్తుకు 'స్థానిక' పట్టం

- 632 ఓట్లతో విజయం
- స్వతంత్ర అభ్యర్థి రామకృష్ణకు 108 ఓట్లు
- ఇరు పార్టీల నుంచి క్రాస్ ఓటింగ్
- వైసిపి నుంచి 70కు పైగా ఓట్లు బదిలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నర్తు రామారావు ఘన విజయం సాధించారు. తన సమీప స్వతంత్ర అభ్యర్థి ఆనెపు రామకృష్ణపై 524 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు. మొత్తం 752 ఓట్లు పోలవగా, రామారావుకు 632 ఓట్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థి రామకృష్ణ 108 ఓట్లు సాధించగా, 12 ఓట్లు చెల్లకుండా పోయాయి.

శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టారు. పౌర సరఫరాలశాఖ కమిషనర్, స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు హనుమంతు అరుణ్‌కుమార్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్ సమక్షంలో తొలుత స్ట్రాంగ్‌రూమ్‌లో ఉన్న బ్యాలెట్ బాక్సులను లెక్కింపు గదుల్లోకి తరలించారు. బాక్సులపై ఉన్న ఓట్లకు, పోలైన ఓట్లకు మధ్య తేడాను పరిశీలించి ఎటువంటి వ్యత్యాసం లేకపోవడంతో ఒక డ్రమ్ములో వేశారు. ఆ తర్వాత 25 ఓట్లను ఒక కట్టగా వేరే డ్రమ్ములో వేశారు. వాటిని తీసి అభ్యర్థులకు వచ్చిన ఓట్లను వారికి సంబంధించిన ట్రేలో వేశారు. వాటిని మళ్లీ 25 కట్టలుగా కట్టి లెక్కించారు. అనంతరం లెక్కించి ఆయా అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలను ప్రకటించారు. వైసిపి అభ్యర్థి నర్తు రామారావు తన సమీప ప్రత్యర్థి ఆనెపు రామకృష్ణపై 524 ఓట్లతో గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ప్రకటించి, ధ్రువీకరణ పత్రం అందజేశారు.

ఇరు పార్టీల నుంచి క్రాస్ ఓటింగ్

వైసిపి నేతలు అనుమానించినట్లే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగింది. స్వతంత్ర అభ్యర్థి మద్దతుదారులు ఊహించినంతగా కాకపోయినా స్వల్పస్థాయిలో జరిగింది. పంచాయతీరాజ్ ఛాంబర్, తూర్పుకాపు సంక్షేమ సంఘం మద్దతుతో బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థి రామకృష్ణకు ప్రధానంగా వైసిపికి చెందిన కాపు సామాజిక తరగతి ఓటర్లు అండగా నిలుస్తారని అంతా భావించారు. ఫలితాల్లో ఆరకమైన మద్దతు కనిపించలేదు. మరోవైపు టిడిపి నుంచీ ఆయనకు పూర్తిస్థాయిలో సహకారం లభించలేదని తెలుస్తోంది. అభ్యర్థులకు వచ్చిన ఓట్లను పరిశీలిస్తే వైసిపి అభ్యర్థి నర్తు రామారావుకు 632, స్వతంత్ర అభ్యర్థి రామకృష్ణకు 108 ఓట్లు రాగా 12 ఓట్లు చెల్లనివిగా తేలాయి. ఫ్యాన్ గుర్తుపై గెలిచిన స్థానిక ప్రజాప్రతినిధుల 666 ఓట్లు ఉన్నాయి. వీరిలో ఇద్దరు మినహా మిగిలిన 664 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. వీరితోపాటు టిడిపి నుంచి గెలుపొందిన వారూ నర్తు రామారావుకు ఓటేసినట్లు తెలుస్తోంది. ఇచ్ఛాపురానికి చెందిన టిడిపి నాయకుడు ఒకరు ఒకరు నర్తు రామారావు సమీప బంధువు కావడంతో ఆ నియోజకవర్గానికి చెందిన ఎంపిటిసిలు వైసిపికి ఓటేసినట్లు సమాచారం. దీంతోపాటు టిడిపిలో ఉన్న యాదవ సామాజిక తరగతి ప్రజాప్రతినిధులు ఆయనకే మద్దతు పలికినట్లు తెలుస్తోంది. ఆమదాలవలస నియోజకవర్గానికి చెందిన టిడిపి ముఖ్యనేత ఒకరు తన సామాజిక తరగతి ఓటర్లను నర్తు రామారావుకు వేయాలని సూచించినట్లు తెలిసింది. ఇలా అన్ని సమీకరణాలతో వైసిపి అభ్యర్థికి టిడిపి నుంచి సుమారు 40 ఓట్ల వరకు వెళ్లాయని తెలుస్తోంది. అంటే మొత్తం మీద నర్తు రామారావుకు 704 ఓట్లు రావాలి. కానీ 632 ఓట్లే వచ్చాయి. అంటే 72 మంది వైసిపి ప్రజాప్రతినిధులు స్వతంత్ర అభ్యర్థికి ఓటేశారు. దీన్నిబట్టి ఇరు పార్టీల నుంచి క్రాస్ ఓటింగ్ జరిగినా, వైసిపికి కొంత ఎక్కువ జరిగిందనేది తెలుస్తోంది.

బయోడేటా

పేరు : నర్తు రామారావు
స్వగ్రామం : కొత్తపుట్టుగ, కవిటి మండలం
పుట్టిన తేదీ :17.5.1957
విద్యార్హతలు : పదో తరగతి
కుటుంబసభ్యులు : భార్య చామంతి. గతంలో కవిటి ఎంపిపిగా పనిచేశారు. కుమారులు శివాజీ (బిటెక్), రవికుమార్ (బిటెక్). కుమార్తె పద్మ కవిటి ఎంపిపి.
చేపట్టిన పదవులు : 1986లో కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయరంగ ప్రవేశం చేశారు. లండారిపుట్టుగ సర్పంచ్‌గా రెండుసార్లు, బెలగాం పిఎసిఎస్ చైర్మన్‌గా, కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారిగా ఎనిమిదేళ్ల పాటు పనిచేశారు. పిసిసి జాయింట్ సెక్రటరీగా 2008 నుంచి 2013 వరకు పనిచేశారు. 2009లో ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2013లో వైసిపిలో చేరారు. 2014లో ఇచ్ఛాపురం నియోజకవర్గ వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు.

నర్తు రామారావుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి నవీన్

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో సిక్కోలు సత్తా

- జాతీయస్థాయి పోటీలకు ఆరుగురు ఎంపిక
- 15 పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు
- ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు సత్తా చాటారు. విశాఖపట్నం జిల్లా యలమంచిలిలోని ఇండోర్ స్టేడియం వేదికగా 40వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్, 5వ ఎపి క్యాడట్స్ బాలబాలికల తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. ఆరు బంగారు, మూడు రజత, ఏడు కాంస్య పతకాలతో కలిపి మొత్తం 15 పతకాలు సాధించి శభాష్ అనిపించారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విభాగంలో సిక్కోలు తృతీయ స్థానంలో నిలవడం విశేషం. జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి రికార్డు స్థాయిలో ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన డి.త్రివేణి, పి.యషిత, ఎ.ప్రశాంత్ కుమార్, టి.ఢిల్లేశ్వరరావు, జి.హిమచందన్, జి.రిత్విక్ లోకేష్ ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు రాజస్థాన్‌లో నిర్వహించే జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నట్లు తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధి కొమర భాస్కర్ వెల్లడించారు. సబ్ జూనియర్ విభాగంలో 16 కేజీల విభాగంలో డి.త్రివేణి, 26 కేజీల విభాగంలో పి.యషిత, క్యాడట్ విభాగంలో 33 కేజీల విభాగంలో ఎ.ప్రశాంత్ కుమార్, 37 కేజీల విభాగంలో టి.ఢిల్లేశ్వరరావు, 45 కేజీల విభాగంలో జి.హిమచందన్, 57 కేజీల విభాంలో జి.రిత్విక్ లోకేష్ బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. పలు కేటగిరీల్లో ఆర్.తన్మయి, వి.చాతుర్య, ఎ.దేవిప్రసాద్ రజత పతకాలు, పి.గగన్, వి.రుషికేశ్, జి.రోహిత్, ఆర్.చతుర్‌సాయి ప్రీతం, ఎం.సంజన, ఎం.జోషిక, ఎస్.శ్రీశాన్వి కాంస్య పతకాలను దక్కించుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఒలింపిక్ సంఘ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ముఖ్య సలహాదారులు పి.సుందరరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎం.వి.రమణ, పోలినాయుడు, చీఫ్ కోచ్ ఎం.మాధురీలత, జిల్లా ఉష అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

పతకాలు సాధించిన విద్యార్థులు

మండలి ఓట్ల లెక్కింపులో ఉత్కంఠ

తొలి రౌండ్ పూర్తయ్యేసరికి టిడిపి, వైసిపి హోరాహోరీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. గురువారం విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియను అధికార యంత్రాంగం చేపట్టింది. ప్రారంభ కౌంటింగ్ సాయంత్రం 6 గంటల వరకూ జరిగింది. ఓట్లన్నిటినీ కట్టలు కట్టి వేసే ప్రక్రియ సుమారు సాయంత్రం వరకూ సాగింది. మొదటి రౌండ్ ఫలితం వెల్లడయ్యేసరికి టిడిపి వెయ్యి ఓట్ల మేర వైసిపిపై ఆధిక్యతను కనబర్చింది. పిడిఎఫ్ మూడో స్థానంలో ఉంది. మొత్తంగా 28 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఒక రౌండ్‌లో 28 వేల ఓట్లను లెక్కిస్తారు. మొత్తంగా 2 లక్షల పైచిలుకు ఓట్లు పోలైన పంగతి తెలిసిందే. గురువారం రాత్రి 9 గంటల వరకూ తొలి రౌండ్ ఫలితాన్ని సైతం అధికారులు వెల్లడించలేదు. రెండో రౌండ్ 9 గంటలకు ప్రారంభం అయ్యింది. రాత్రి 11 గంటలు దాటే సరికి 2 రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉందని రిటర్నింగ్ అధికారులు వెల్లడించారు. 3 రౌండ్ల లెక్కింపు పూర్తయ్యే సరికి రాత్రి ఒంటి గంట దాటే అవకాశం ఉంది. ప్రతి రౌండ్‌కూ 2 గంటలకు పైనే సమయం పడుతోంది.

రాత్రి 9.30 గంటల సమయానికి వెలువడిన సమాచారం మేరకు..

టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు 8,854 ఓట్లతో ప్రథమ స్థానంలో నిలవగా వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ 7,850 ఓట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నారు. పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ 5346 ఓట్లతో మూడో స్థానంలో ఉన్నారు. మొదట రౌండ్ ఓట్ల లెక్కింపు శ్రీకాకుళం జిల్లాకు సంబంధించినదని, అక్కడ టిడిపికి కాస్త మెజారిటీ ఉంటుందని తొలినుంచీ భావిస్తున్న విషయం చర్చనీయాంశమైంది. అనకాపల్లి ప్రాంతంలో కూడా టిడిపికి ఓట్లు అధికంగా వచ్చే వీలుందన్నది తెలుస్తోంది. వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ఒకటో రౌండ్ ఓట్ల లెక్కింపు అనంతరం మీడియాతో మాట్లాడుతూ చివరకు విజయం తనదే.. అంటూ ధీమా వ్యక్తం చేశారు. ఇంకా 1.70 లక్షల ఓట్లకు పైగా లెక్కించాల్సి ఉందన్నారు.

స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది

అధికారుల ఆకస్మిక ప్రకటనల గందరగోళం

మొదట రౌండ్ కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్వర్ణభారతి ఆడిటోరియంలో ఒక ప్రకటన చేస్తూ.. బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థికి ఎదురుగా టిక్ మార్క్ పెట్టినా ఒకటి అని సూచించినా చెల్లుతుందని ప్రకటించారు. తొలుత ఈ అంశంపై క్లారిటీ ఇవ్వకుండా ఒక రౌండ్ పూర్తయ్యేసరికి ప్రకటించడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమయ్యాయి.

మీడియాపై ఆంక్షలు

కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) స్పష్టంగా మీడియా ప్రతినిధులకు పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్దకు నేరుగా వెళ్లేందుకు పాస్‌లను మంజూరు చేసినా కౌంటింగ్ జరిగే స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలోకి మీడియా వారిని అధికారులు అనుమతించలేదు. గతంలో మూడు దఫాలుగా మీడియా ప్రతినిధులను కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించారు. 2023లో మీడియాపై ఆంక్షలు విధించడం, లోపలకి వెళ్లాలని ప్రయత్నించే వారితో పోలీసులకు ఘర్షణలకు దిగడం జరిగింది. స్వర్ణభారతి స్టేడియం మొదటి గేటు వరకే గురువారం మీడియాను అనుమతించారు. దీంతో సమాచారం కోసం మీడియా నానా అవస్థలు పడాల్సి వచ్చింది.

20న విజయవాడలో మహా ధర్నా

- విజయవంతం చేయాలి
- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

కరపత్రాలను అవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలపై అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఈనెల 20న విజయవాడ అలంకార్ సెంటర్‌లో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన మహా ధర్నాను చేపడుతున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుధ, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి తెలిపారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహా ధర్నా కరపత్రాలను నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు సేవలందిస్తున్న అంగన్వాడీలకు ప్రభుత్వాలు ఉద్యోగ భద్రత కల్పించడం లేదని విమర్శించారు. అంగన్వాడీ కేంద్రాలకు బలోపేతం చేయడానికి నిధులు పెంచడం లేదన్నారు. అంగన్వాడీలకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.లతాదేవి తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి జీవితం ఆదర్శప్రాయం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నేటి యువతకు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయులని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. అటువంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులన్నారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి కలెక్టరేట్ ఎఒ, డిఎస్ఒ, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్‌పి జి.ఆర్ రాధిక పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి అని అన్నారు. మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో డిఎస్‌పిలు జి.శ్రీనివాసరావు, ఎస్.వాసుదేవ్, సిహెచ్.జి.వి ప్రసాదరావు, పోలీసు కార్యాలయ ఎఒ శివరామరాజు, ఆర్ఐ ఉమామహేశ్వరరావు, ప్రదీప్, సిఐలు బి.ప్రసాద్, ఎస్ఐలు, కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

SRIKAKULAM MUNICIPAL CORPORATION

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో **స్వచ్ఛ సర్వేక్షణ్ 2023-2024** కార్యక్రమంలో భాగముగా **గార్బేజ్ ఫ్రీ సిటీ (GFC), ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ (ODF)** మరియు **సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్** సంబంధించిన రిపోర్టింగ్, డాక్యుమెంటరీ, మొదలగు పనులకు ఈ నగరపాలక సంస్థ కార్యాలయలమునకు తాత్కాలిక ప్రాతిపదికన పని చేయుటకు అనుభవం కలిగిన ఏజెన్సీల నుండి కొటేషన్లు స్వీకరించబడును. ఎంపిక కాబడిన ఏజెన్సీకి (ఒక నెలకు రూ.37,000/- చొప్పున చెల్లించబడును.) ఆశక్తి గల ఏజెన్సీ వారు తేది: **23.03.2023** కొటేషన్లు సమర్పించవలసినదిగా కోరడమైనది.**గమనిక: ఏజెన్సీ తరుపున కనీసం ఇద్దరు అభ్యర్థులు ఉండవలెను**

ఇతర వివరముల కొరకు ఈ ఆఫీస్ పని చేయు వేళలలో సంప్రదించగలరు
Cont. No. 9849906972, 8790845205,

Commissioner
Srikakulam Municipal Corporation

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు

ప్రజాశక్తి- కవిటి
అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలు అజరామరం అని తహశీల్దార్ రాచర్ల అప్పలరాజు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన శ్రీరాములు మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో డిటిలు టి.రామచంద్రరావు, ఈశ్వరరావు, ఆర్ఐ రమణమూర్తి, విఆర్ఒలు, విఆర్ఎలు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మున్సిపాల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కమిషనర్ కె.అప్పలనాయుడు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ బి.లక్ష్మీనారాయణ, టి.పి.ఎస్‌హెచ్.వి.సత్యనారాయణ, ఎఇ బి.శృజన, ఐ.సాయిరాం, కె.వి.సుబ్రహ్మణ్యం, ఎ.వి. శ్రీనివాస్, ఎస్.హరీష్, సిహెచ్.పెంటయ్య పాల్గొన్నారు.

శ్రీకాకుళం : బలగ శాఖాగ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఉగ్రసేను పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ స్కూల్ విద్యార్థులు, పాఠకులు గ్రంథాలయ సహాయకరాలు కె.అనిత పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని పొట్టి శ్రీరాములు కూడలి వద్ద గల ఆయన విగ్రహానికి టిడిపి నాయకులు, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్, నగరంలోని గాంధీ మందిరంలో శ్రీరాములు విగ్రహానికి యువ పారిశ్రామికవేత్త అంధవరపు ప్రసాద్, అరసవల్లిలోని శార్వాణి స్కూల్‌లో శ్రీరాములు చిత్ర పటానికి కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

పొందూరు: పొందూరు శాఖాగ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయాధికారి పి.వి.భాస్కరరాజా పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మానసవేణి స్కూల్ ఉపాధ్యాయులు శ్రీరాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు : ముకపాక శాఖాగ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రథమ, ద్వితీయ, గెలుపొందిన తృతీయ బహుమతులను గ్రంథాలయం తరుపున అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖరావు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే లావేరు శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఏ.గడ్డియ్య విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి టి.ఇందిరా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది దాసరి లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగాం: స్థానిక వైసిపి కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు సర్లాన భైరాగి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచ్‌లు మడపాల సంజీవరావు, బొమ్మాలి గున్నయ్య, తమిరె రాజు, నీలయ్య, దాలయ్య, ప్రగడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో గురువారం పొట్టి శ్రీరాములు 122వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పశు సమర్థకశాఖ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు కార్యక్రమంలో ఎడి పోతనపల్లి చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాశీబుగ్గ సాయి కాలనీలో శ్రీరాములు జయంతి నిర్వహించారు కార్యక్రమంలో అటవీ శాఖ సెకేషన్ అధికారి బి.లక్ష్మినారాయణ, బ్రాంచ్ ఆఫీసర్ జివి.కృష్ణారావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించుకున్న మహా పురుషుడని, ఆయన తెలుగు ప్రజల ధిక్కార స్వప్నం అని ఎంపిపి ఆర్.ఉమామల్లేశ్వరరావు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ప్రజా పరిషత్‌లో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, నాయకులు సింగుపురం వినోద్, నేతింటి సింహాచలం, హెచ్.తేజ, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలోని ముచ్చింద్ర ఎంపిపి స్కూల్‌లో హెచ్ఎం సుహాన్ చంద్ ఆధ్వర్యాన పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు. శాంతినికేతన్ విద్యా సంస్థలో చైర్మెన్ దక్కత కృష్ణమూర్తిరెడ్డి అధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు.

సంతబొమ్మాళి: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి కె.రామకృష్ణ ఆధ్వర్యాన శ్రీరాములు 122వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి పాఠశాల హెచ్ఎం ఎ.రామారావు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

పలాస : మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

శ్రీకాకుళం అర్బన్ : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న గొండు శంకర్

నందిగాం : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న తిలక్

శ్రీకాకుళం : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉగ్రసేను

కవిటి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న తహశీల్దార్ అప్పలరాజు

యువ క్లబ్‌ను ప్రారంభిస్తున్న నారాయణరావు

కెజిబివిలో యువ క్లబ్ ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
జిల్లాలో పర్యాటక ప్రదేశాలను, జాతరలను, బీచ్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పర్యాటకశాఖ ఆధ్వర్యాన యువ క్లబ్‌లను ఏర్పాటు చేసి వీటి ఔన్నత్యాన్ని తెలియజేందుకు కృషి చేస్తున్నామని పర్యాటశాఖ జిల్లా అధికారి నడిమిటి నారాయణరావు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం కెజిబివిలో గురువారం యువక్లబ్‌ను ప్రారంభించారు. 7 నుంచి డిగ్రీ చదివిన విద్యార్థులతో ఈ క్లబ్‌లను ఏర్పాటు చేసి జిల్లా చరిత్రను ఇనుమడింపచేస్తామన్నారు. విద్యార్థులు ఏడాదికి కావాల్సిన కార్యక్రమాల ప్రణాళికను తయారు చేస్తున్నామని అన్నారు. విద్యార్థులకు నైపుణ్యంతో పాటు, విజ్ఞానం, వినోదం కూడా అందుతుందన్నారు. కెజిబివి స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సూర్యకుమార్ మాట్లాడుతూ జిల్లాలోని చరిత్ర కలిగిన ప్రదేశాలను వ్యాసరచన రూపంలో అందించాల్సిన అవసరం ఉందన్నారు. జడ్‌పిహెచ్ స్కూల్ హెచ్ఎం టి.అమ్మాజి మాట్లాడుతూ జిల్లాలోని జాతరలను, అడ్వెంచర్, ఎక్టివిటిస్, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మంచి విజ్ఞానం కలుగుతుందన్నారు. చుట్టు పక్కల ఉన్న చారిత్రిక ప్రదేశాలను గుర్తించి పర్యాటకశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. వారికి తెలియవలన్నారు. కార్యక్రమంలో టి.బాలకృష్ణకుమార్, స్పందన యువజన సంఘ సభ్యులు పి.కృష్ణారావు, సహాయ పర్యాటక అధికారి డి.రమేష్, ఉపాధ్యాయులు డి.శైలజ, నీలవేణి, సన్యాసమ్మ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- మెళియాపుట్టి
వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని టెక్కలి డివిజన్ డిప్యూటీ వైద్యాధికారి లక్ష్మీతులసి అన్నారు. మండలంలోని పెద్దలక్ష్మీపురంలో బిసి వసతిగృహాన్ని గురువారం సందర్శించారు. ఈ మేరకు సుమారు తొమ్మిది మంది విద్యార్థులకు సాధారణ జ్వరం ఉన్నట్లు గుర్తించినట్టు చాపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు హేమంతలక్ష్మి తెలిపారు. అనంతరం వారికి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి రక్త పరీక్షల నిర్వహించారు. సాధారణ జ్వరం కావడంతో సంబంధిత మందులను విద్యార్థులకు అందించి పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న హేమంతలక్ష్మి

నేడు 'సాహిత్యంలో మహిళ'పై సదస్సు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం 'సాహిత్యంలో మహిళ' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ సదస్సుకు నందమూరి లక్ష్మీపార్వతి విచ్చేస్తున్నారని అన్నారు. మన రాష్ట్రంతో పాటు ఒడిశా, తెలంగాణ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ నుంచి ప్రముఖులు హాజరుకానున్నారని చెప్పారు. అంబేద్కర్ యూనివర్సిటీ విసి నిమ్మ వెంకటరావు, రాజకీయ నాయకులు హాజరవుతారని అన్నారు. ఈ కళాశాలలో పది కోర్సులతో పాటు, ఐదు సర్టిఫికెట్ కోర్సులు, స్కిల్ హబ్ ద్వారా రెండు కోర్సులు, మూడు జాతీయ సేవా విభాగం కేంద్రాలు, రెడ్ రిబ్బన్, కల్చరల్ వంటివి విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

అలంకరణ చేపల పెంపకంపై శిక్షణ

నౌపడ : మండలంలోని వడ్డితాంద్ర ఆర్‌బికెలో అలంకరణ చేపల పెంపకంపై మత్స్యకారులకు మూడు రోజులు పాటు శిక్షణను జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.శ్రీనివాసరావు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారుల జీవనోపాధిని పెంపొందించుకునేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. చేపల పెంపకంలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి టెక్కలి శ్రీ ధర్మరాజు పాత్రో, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జనప్రియ, ఇన్లాండ్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ ఉమాపతి, వడ్డీతాంద్ర ఎంపిటిసి హన్నూరావు, ఫిషరీస్ అసిస్టెంట్ నరేష్, నవీన్ కుమార్, సచివాలయ సిబ్బంది, స్థానిక మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

బుక్‌లెట్ ద్వారా శిక్షణ ఇస్తున్న అధికారులు

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
మండలంలోని కొలిగాంకు చెందిన సూరజ్ మండల్(23) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. కోలిగామ్ గ్రామ ఇటుక బట్టిలో గుమాస్తాగా పని చేస్తున్న సూరజ్ మృతికి గల కారణాలపై పోలీసులు విచారణ చేస్తున్నార తల్లితండ్రులు సురేంద్ర మండల్, తుంబా మండలో రోదిస్తున్నారు. ముగ్గురు సంతానంలో గతేడాది హరిపురం వద్ద విద్యుత్ ఘతాకానికి ఒకరు మృతి చెందడం, ఇప్పుడు మరో కొడుకు మృతి చెందడం తట్టుకోలేకపోతున్నారు. మరో చిన్నా కొడుకు హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. రూరల్ ఇన్‌ఛార్జి ఎస్ఐ.గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుకు వేలాడుతున్న మృతదేహం

పట్టుకున్న మద్యం సీసాలతో ఎస్ఇబి అధికారులు

అక్రమ మద్యం పట్టివేత

ప్రజాశక్తి- పొందూరు
పొందూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ పరిధిలోని జి.సిగడాం మండలం మెట్టవలస సమీపంలోని దాబాపై ఎస్ఇబి, జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు బుధవారం రాత్రి దాడులు చేశారు. ఈ దాడిలో అక్రమ మద్యం నిల్వలను గుర్తించి పట్టుకున్నారు. ఈ దాడి సమయంలో అక్రమంగా మద్యం సీసాలతో మెట్టవలసకు చెందిన డొకర ఎర్రప్పడు అరెస్టు చేశామని ఎస్ఇబి సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. పట్టుబడిన వ్యక్తి వద్ద ఉన్న 143 మద్యం సీసాలు, 24 బీర్ సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆయనను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మద్యం దుకాణాలను మూసివేసినప్పటికి భారీగా మద్యం సీసాలు పట్టుబడడంపై పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. దాడిలో ఎస్ఇబి ఎస్ఐ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైసిపి నాయకుడు మృతి

వజ్రపుకొత్తూరు: వైసిపి సీనియరు నాయకుడు తోట సత్యనారాయణ (75) గురువారం పాత టెక్కలిలోని తన నివాసంలో మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా ఈయన పని చేశారు. మండల వ్యవస్థ ఏర్పడిన తరువాత మొదటి సారి ప్రత్యక్షంగా జరిగిన మండల పరిషత్ అధ్యక్ష స్థానానికి మల్లా సూర్యనారాయణతో తలపడి స్వల్ప ఓట్లతో ఓటమి చెందారు. పిఎసిఎస్ అధ్యక్షులుగా పని చేశారు. గత కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. తోట సత్యంగా మండలంలో సుపరిచితులు. ఈయన మృతిపై వైసిపి మండల అధ్యక్షులు గురయ్యానాయుడు, జెడ్‌పి వైస్ చైర్మన్ పాలిన శ్రావణి, మధుకేశవరావు, తదితరులు సంతాపం తెలిపారు. శుక్రవారం ఉదయం పాతటెక్కలిలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

సత్యనారాయణ (ఫైల్)

'ఉపాధి' పనుల పరిశీలన

సంతబొమ్మాళి : మండలంలోని పాలతలగాం, ఆర్.హెచ్.పురంలో చేపడుతున్న ఉపాధి హామీ పనలను ఎంపిడిఒ జి.ఉమాసుందరి గురువారం పరిశీలించారు. మస్తరు ప్రకారం పనిచేస్తే రూ.250 కూలి వస్తుందని అన్నారు. పనిలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ఈమెతో పాటు ఇసి మునీంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ టి.రోహిణి ఉన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఉమాసుందరి

ఎమ్మెల్సీ 'నర్తు'కు అభినందనలు

ఇచ్ఛాపురం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన నర్తు రామారావుకు అభినందనలు వెల్లువెత్తాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ ఉలాల భారతి దివ్య రామారావును పూలమాలతో గురువారం అభినందించారు. రామారావు విజయంతో నియోజకవర్గం మరింత ప్రగతి పథంలో ముందుకు వెళ్తుందని ఆమె అన్నారు. పరపతి కోటేశ్వరరావు, తదితరులు నర్తును అభినందించారు.

సోంపేట : రామారావును అభినందిస్తున్న యశోద

సోంపేట: ఎమ్మెల్సీగా గెలుపొందిన నర్తు రామారావును జెడ్‌పిటిసి తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సోంపేటకు చెందిన ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో ఎన్నికైన నర్తు రామారావుకు నియోజకవర్గ వైసిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు హర్షం ప్రకటించారు. తన క్యాంప్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. రామారావు పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. ఈయనతో పాటు నాయకులు సవర రమేష్, అంపిలి.ప్రశాంత్ కుమార్, లోతుగెడ్డ తాతబాబు, పడల వెంకటకృష్ణ, తొత్తడి పోలినాయుడు, బలగ అప్పారావు ఉన్నారు.

నారాయణ సేవకు వాహనం అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
ప్రతిఒక్కరూ సేవ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని గురజాడ విద్యా సంస్థల అధినేత జి.వి.సోమినాయుడు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం రూరల్ మండలం గురజాడ కళాశాలలో నారాయణ సేవా సంఘం సభ్యులు చుట్టుపక్కల ఆహారం పంచిపెట్టేందుకు రూ.ఏడున్నర లక్షలు విలువైన వాహనాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవసేవ మాధవసేవ అని అన్నారు. వీరఘట్టం మండలం చిట్టిపూడివలస నారాయణసేవా సంఘం ప్రారంభించి సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. తాగునీటి సౌకర్యానికి రూ.4 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో స్వామినాయుడు కుటుంబ సభ్యులు, సత్యసాయి సేశా సంస్థ జిల్లా అధ్యక్షులు వై.లింగరాజు, రిమ్స్ అన్నదాన పథక జిల్లా అధ్యక్షులు జి.రమణబాబు, సేవాదళ్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.రామచంద్ర రావు, కార్యదర్శి ఫాల్గుణరావు, డాక్టర్ సీతంనాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాహనాన్ని ప్రారంభిస్తున్న స్వామినాయుడు

గిన్నిస్ బుక్‌లో చోటు కోసం 70 రోజులుగా పరుగు

కోటబొమ్మాళి: బిహార్ రాష్ట్రానికి చెందిన 10వ తరగతి విద్యార్థి హర్షత్ పండిత్ గిన్నిస్ బుక్ అఫ్ ది రికార్డు సాధించటం కోసం జనవరి 4వ తేదీన ఇండియా గేటు వద్ద తన పరుగును ప్రారంభించాడు. ముంబాయి, చెన్నాయ్, కోల్‌కత్తా, భువనేశ్వర్ మీదుగా తిరిగి ఢిల్లీ చేరేందుకు సిద్ధమయ్యాడు. 6వేల కిలోమీటర్లు పరుగెత్తి గిన్నిస్ బుక్‌లో చోటు సాధిం చాలని సిద్ధమయ్యాడు. గురువారం 70 రోజులు పూర్తి చేసుకున్నాడు. గురువారం జర్జంగిలో విద్యార్థి విలేకరులతో మాట్లాడారు. ఏదైన సాధించాలని లక్ష్యంగా చేసుకున్నానని, అందులో భాగంగా ఈ ఆరువేలు కిలోమీటర్లు నడగ ప్రయాణం సాగిస్తున్నాడని తన తండ్రి తెలిపారు.

మాట్లాడుతున్న హర్షత్ పండిత్

నైపుణ్యాలను వెలికితీయాలి


గోరుముద్ద పథకాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి సరోజనమ్మ

ప్రజాశక్తి- టెక్కలి
విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి వున్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఉపాధ్యా యులు శ్రమించాలని ఎంపిపి ఎ.సరోజనమ్మ కోరారు. మండలంలోని పెద్దశాన ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆమె మాట్లాడారు. చదువుపై ఆసక్తి చూపాల న్నారు. పాఠశాల విద్యార్థులు తైక్వాండో పోటీలో రాణించారని హెచ్ఎం శ్రీనివాసరావు ఎంపిపికి వివరించారు. దీంతో వ్యాయామ ఉపాధ్యాయుడు పాండవుల జగదీష్‌ను ఆమె అభినందించారు. ఆమెతోపాటు సర్పంచ్‌లు ఎల్.వనమమ్మ, జి.మోహన్‌రెడ్డి, ఎం.శంకరరావు, కె.కామేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, జి.అప్పలరెడ్డి పాల్గొన్నారు.

గౌరవ వేతనం అందడం లేదు

డ్వామా పీడీ వద్ద మహిళా మేట్ల ఆవేదన

ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి
ఉపాధి హామీ చట్టంలో మేట్లుగా నియమించి, గౌరవ వేతనాలు చెల్లిస్తామని ఎంపిక చేసిన తమకు ఏడాది కావస్తున్నా ఇప్పటివరకు ఆ ఉసేలేదని మహిళా మేట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవి చిట్టిరాజు వద్ద అవేదన వ్యక్తం చేశారు. గురువారం మండలం పరిధిలోని ఎత్తురాళ్లపాడు చెరువు పనులు, మునగ తోటల పెంపకాన్ని, హరిశ్చంద్రపురం పంచాయతీలో వింజాంపాడు గ్రామానికి చెందిన అమృత్ సరోవర్ చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీని మహిళా మేట్లు కలిసి తమ సమస్యలను విన్నవించారు. పీడీ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి మీ సమస్యను తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటన్నారు. అనంతరం కూలీలతో ఆయన మాట్లాడారు. కూలీలు కనీసం 6గంటల సమయం పని చేస్తే గరిష్ఠ వేతనం రూ.257 తప్పనిసరిగా వస్తుందదన్నారు. అందరూ సమానంగా పనులు చేయాలని, సకాలంలో పనులకు వచ్చి సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కూలీలు వారం రోజులు చేయాల్సిన పనికి సంబంధించి కొలతలను సిబ్బంది ఎప్పటికప్పుడు ఇవ్వాలని ఆదేశించారు. సగటు వేతనం జిల్లా వ్యాప్తంగా పెంచడమే ధ్యేయంగా ఉపాధి సిబ్బంది పనులు చేపట్టాలని, లేనట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి గ్రామంలోనూ ఉపాధి హామీ పనులు చేపట్టడం ద్వారా స్థానిక కూలీలకు ఉపాధిని చూపించాలని, పని దినాల కల్పనలో సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యాలను కచ్చితంగా చేరుకోవాల్సిందేనని అన్నారు. కూలీలు, స్థానికులతో సమన్వయం పెంపొందించుకుని స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేమ్ బోర్డులు ప్రతి పని ప్రదేశం వద్ద కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. పీడీ వెంట ఎంపిడిఒ జి.ఉమాసుందరి, ఎపిఒ జి.హరిప్రసాద్, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ రజని

పంచాయతీ అభివృద్ధికి కృషి

రణస్థలం రూరల్ : అందరి సహకారంతోనే పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నానని బంటుపల్లి సర్పంచ్ నడుకుదిటి రజని అన్నారు. గ్రామ సచివాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. అనంతరం ముఖ్యమైన నిధులతో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు అభివృద్ధికి తీర్మానం చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ సింహాచలం, ఎంపిటిసి టొంపల సంజీవరావు, వైస్ ప్రెసిడెంట్ టి.సత్యవతి, వార్డు మెంబరు గురాల కరుణ, గురాన నారాయణరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కంచిలి: మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎఇ గురవయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కంచిలి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనులు జరుగుతున్నందున కంచిలి పట్టణం పరిధిలో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. రూరల్ ప్రాంతంలో యథావిధిగా సరఫరా ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

కవిటి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను తహశీల్దార్ అప్పలరాజు గురువారం పరిశీలించారు. పరీక్షా కేంద్రం వద్ద చేసిన ఏర్పాట్లను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

పోలాకి: ఇంటర్ పరీక్షలు రెండో రోజు గురువారం ప్రశాంతంగా జరిగాయని సిఎస్‌లు కె.గోవిందరావు, పి.హేమంత్‌కుమార్ తెలిపారు. మండలంలోని పిరియాగ్రహారం, పోలాకి జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. పిరియాగ్రహారంలో ద్వితీయ ఏడాది తెలుగు పరీక్షకు 168 మందికి 165 మంది హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 179 మదికి ఎనిమిది మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు ప్రసాద్ శర్మ, ఫ్లైయింగ్ స్క్వాడ్ రమేష్ పరిశీలించారు. కార్యక్రమంలో సిఎస్ కె.గోవిందరావు, డిఒలు టి.సురేష్, సి.ధనుంజయరామన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహశీల్దార్

గిరిజన మహిళలకు అవార్డులు



అవార్డును స్వీకరిస్తున్న తులసి, సుజాత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
కాన్ఫరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రపెన్యూర్స్ ఇండియా మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ప్రకటించిన అవార్డును ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి చెందిన స్వర్ణముఖి, వంశధార ఫార్మర్స్ ప్రొడ్యుసర్స్ ఆర్గనైజేషన్‌కు నాయకత్వం వహిస్తున్న సవర తులసి, దేవాది సుజాతలు దక్కించుకున్నారు. విజయవాడలోని పున్నమి ఎపిటిడిసి అతిథిగృహంలో నిర్వహించిన కోవే జాతీయ స్థాయి సమావేశంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకష్ణారెడ్డి గురువారం అందజేశారు. కార్యక్రమంలో గీతాశ్రీకాంత్, ఎపిఐఐసి ఎండీ శ్రీజన గుమ్మళ్ల, కోవే జాతీయ చైర్‌పర్సన్ మధు త్యాగి, అవార్డ్స్ చైర్‌పర్సన్ ప్రొద్దుటూరి సౌదామిని, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, ఎపి టూరిజం చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, ఎపి శాఖ కోవే అధ్యక్షులు రాధిక, సెక్రటరీ విజయలక్ష్మి, నేషనల్ సెక్రటరీ అపర్ణ, లలితా పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరాలకు స్పందన

కొత్తూరు : నేత్రాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆప్తాలమిక్ వైద్యాధికారి ఇప్పలి జానకిరామయ్య అన్నారు. స్థానిక సత్యసాయి మందిరంలో గురువారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. కొత్తూరు మండలంలో పాటు, పార్వతీపురం మన్యం జిల్లా భామిని, ఒడిశా రాష్ట్రం నుంచి రోగులకు తరలివచ్చారు. ఈ మేరకు 65 మంది నేత్రాలను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. అందులో 25 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో లోతుగెడ్డ భగవాన్‌దాసునాయుడు, భానోజీరావు, పి.రవికుమార్ పాల్గొన్నారు.

పొందూరు : నేత్రాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పొందూరు : మండలంలోని రాపాక పంచాయతీ పరిధిలోని ఇల్లయ్యగారిపేట, వావిలపల్లిపేట గ్రామాల్లో వైసిపి కంటి వెలుగు మూడో విడతలో భాగంగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలోని 40 మంది వృద్ధులకు ఆప్తాలమిక్ అధికారి డాక్టర్ అనసూయ నేత్రాలను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. అలాగే వీరిలో పలువురిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పి జ్యోత్స్న, ఎఎన్ఎం వనజాక్షి, హెల్త్ అసిస్టెంట్ రమణ, ఆశా కార్యకర్తలు శ్రీదేవి, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

కొత్తూరు : నేత్రాలను పరీక్షిస్తున్న జానకిరామయ్య

కార్యాలయం వద్ద ఆనందం వ్యక్తం చేస్తున్న సభ్యులు

'ఆసరా' ప్రకటనతో ఆనందం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సంక్షేమ కేలండర్ ప్రకారం డ్వాక్రా మహిళా సంఘాలకు రుణమాఫీలో భాగంగా వైఎస్ఆర్ ఆసరా పథకం మూడో విడత 25న వేస్తున్నట్లు సిఎం ప్రకటించారు. ఈ మేరకు మహిళా సమైక్య కార్యాలయం వద్ద గురువారం ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు మాట్లాడారు. నియోజకవర్గంలో 4,394 సంఘాల్లో 46,600 మంది సభ్యులకు రూ.122.95 కోట్లు లబ్ధిపొందుతున్నట్లు వివరించారు. ఆమదాలవలస రూరల్‌లో 934 సంఘాల్లో 9354 మంది సభ్యులకు 26.72 కోట్లు, ఆమదాలవలస అర్బన్ 616 సంఘాలు 6,295 మంది సభ్యులకు 17.96 కోట్లు, పొందూరు మండలంలో 1,319 సంఘాల్లో 15,121 మంది సభ్యులకు రూ.37.80 కోట్లు, బూర్జ మండలం 914 సంఘాల్లో 9386 మంది సభ్యులకు రూ.23.18 కోట్లు, సరుబుజ్జిలి మండలం 611 సంఘాల్లో 6,444 మంది సభ్యులకు రూ.17.28 కోట్లు లబ్ధి పొందుతున్నట్లు వివరించారు. 25న శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు.

ఎఫ్‌డి బాండ్లను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన బడే రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన పిల్లలు చరణ్య 10వ తరగతి, మనస్వి 8వ తరగతి బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. విషయం తెలుసుకున్న రమేష్ స్నేహితులు, 1991-92 బ్యాచ్ విద్యార్థులను చలించిపోయారు. తమ స్నేహితుని కుటుంబానికి రూ.85 వేలు, బ్రాహ్మణతర్ల హెల్పింగ్ వారియర్స్ రూ.45,600లు ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని ఎస్‌బిఐలో ఎఫ్‌డి చేశారు. ఆ బాండ్లను కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్‌వి.రమణ, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కాస్మోటిక్స్ అందిస్తున్న ప్రతినిధులు

విద్యార్థులకు కాస్మోటిక్స్ పంపిణీ

టెక్కలి: మండలంలోని తలగాం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో చదువుతున్న 15 మంది పేద విద్యార్థులకు బిగ్ హెల్ప్ అసోసియేషన్ చైర్మన్ ఎస్.కృష్ణారావు గురువారం పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థలు పాఠశాల అభివృద్ధిలో భాగం కావడం అభినందనీయమని హెచ్‌ఎం ఎ.ధర్మారావు అన్నారు. కార్యక్రమంలో ఆర్.రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి తోడ్పాటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సంపూర్ణ అవగాహనతో విధులు నిర్వహించి సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని ఎపి సహకార యూనియన్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు లేబర్ కాంట్రాక్ట్ సహకార సంఘాల చైర్మన్లకు, పాలకవర్గ సభ్యులకు సూచించారు. స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో నేషనల్ సెంటర్ ఫర్ కో-ఆపరేటివ్ ఎడ్యుకేషన్, న్యూఢిల్లీ ఆధ్వర్యాన రామదాసు సహకార శిక్షణా కేంద్రంతో సంయుక్తంగా గురువారం నిర్వహించిన శిక్షణా తరగతులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అన్నారు. అందులో భాగంగానే సహకార సంఘాల పాలకవర్గసభ్యుల నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసేందుకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సహకాల సంఘాల నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలను తెలియజేశారు. తొలుత పాత బస్టాండ్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఇనవాళ్లర్పించారు. కార్యక్రమంలో రామదాసు సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, డిసిసిబి పాలక మండలి సభ్యుడు బొడ్డేపల్లి నారాయణరావు, డివిజినల్ సహకార అధికారి కె.దామోదర్, సబ్ డివిజినల్ సహకార అధికారి ఎస్.భూషణరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పూజారి జానకీరాం, ఎం.శ్రీనివాసరావు, జి.అరుణకుమారి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

లోవోల్టేజ్ సమస్యతో అవస్థలు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని తరచూ విద్యుత్ అంతరాయం తోపాటు లో వోల్టేజ్ సమస్య అధికంగా ఉండడంతో విద్యుత్ పరికరాలు, బల్బులు, టీవీలు, మోటార్లు, పంపు చెట్లు పాడైపోతున్నాయని పలువురు వినియోగదారులు పేర్కొన్నారు. మండలంలోని సంచాం, పున్నానపాలెం, లక్ష్మీనగర్, తిరుపతిపాలెం, బంటుపల్లి, కంబాలిపేట తదితర గ్రామాలకు వెళ్లే విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పసాటు హై, లోవోల్టేజ్ సమస్యలు అధికంగా ఉత్పన్నమవుతున్నాయని వాపోయారు. లోవోల్టేజ్ సమస్యపై విద్యుత్‌శాఖ అధికారులకు అనేకసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఏదైనా విద్యుత్ సమస్య వస్తే ప్రయివేట్ వ్యక్తులతో మరమ్మతులు చేయించుకుంటున్నామని విమర్శించారు. వీధిలైట్లు పోయి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ బాగు చేసి నాథుడే లేడని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సంచాంలో మబ్బుగా వెలుగుతున్న బల్బు

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వేసవి కాలంలో విద్యార్థులు, ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు జిల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ కార్యక్రమం మహిళా కళాశాలలో నిర్వహించడం అభినందనీయమనిఉమెన్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు అన్నారు. కళాశాల ఆవరణలో గురువారం మజ్జి చలివేంద్రం ఏర్పాటు చేశారు. నగరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు సేదతీరేందుకు వీలుగా తాగునీరు, మజ్జిగ అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జిల్ ఫౌండేషన్ అధ్యక్షులు జాడ సాయి, శివ, సుదర్శన్, సిక్కోలు యువశక్తి ఫౌండేషన్ గీతాశ్రీకాంత్, న్యూశ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ, శ్రీశ్రీ ఫౌండేషన్ చైర్మన్ శ్రీకాంత్, డాడీ హెల్పింగ్ ఫౌండేషన్ ప్రభాస్ సూర్య, అప్‌హోల్డ్ సుప్రజ, జెసిఐ గ్రీన్ సిటీ ప్రెసిడెంట్ మణిశర్మ, సిక్కోలు చేయూత ఫౌండేషన్ వెంకటలక్ష్మి, రోటరీ క్లబ్ జైశ్రీరామ్, కెరియర్ ఫైర్ ఫౌండేషన్ సాయిబాబా పాల్గొన్నారు.

మజ్జిగను పంపిణీ చేస్తున్న సభ్యులు

బీమాను వినియోగించుకోవాలి

గుర్తింపుకార్డులు అందజేస్తున్న సూర్యనారాయణ

ప్రజాశక్తి- సోంపేట

ప్రభుత్వం కార్మికులకు కల్పిస్తున్న బీమా సౌకర్యాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సోంపేట సహాయ కార్మికశాఖ అధికారి సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు బెంకిలిలో గురువారం 14 మంది కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న బీమా అవకాశం కోసం 20,000 మందికి పైగా కార్మికులు నమోదు చేసుకున్నారన్నారు. కానీ చాలామంది గుర్తింపు కార్డులు తీసుకోలేదన్నారు. గుర్తింపు కార్డులు ఉంటేనే బీమా వర్తిస్తుందన్నారు. గుర్తింపు కార్డులేని వారంతా రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, 110 రూపాయలు చలానా ఫారంను తీసుకొని సోంపేట కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

ప్రబలుతున్న డయేరియా

కొత్తూరు : మండలంలోని వెంకటాపురం, మహసింగి, కొత్తూరు గ్రామాల్లో డయేరియాతో పలువురు బాధపడుతున్నారు. దీంతో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులు చికిత్స పొందుతున్నారు. వెంకటాపురానికి చెందిన జి.సింహాచలం, మహసింగికి చెందిన బి.గౌతమి, కొత్తూరు ఎస్‌సి వీధికి చెందిన జి.గడ్డయ్యలు చికిత్స పొందుతున్నారు. వీరికి వైద్యాధికారి ధర్మాన కిషోర్‌కుమార్ వైద్య చికిత్స అందిస్తున్నారు. వేసవి దృష్ట్యా ప్రతిఒక్కరూ అప్రమ త్తంగా ఉండాలన్నారు. ఉపాధి పనులకు వెళ్లే కూలీలు తలకు రక్షణ కల్పించుకోవాలన్నారు. ప్రతి అరగంటకు తాగు నీరు, మజ్జిగ తీసుకోవాలన్నారు.

20న మహసింగిలో 'స్పందన'

టెక్కలి: ఈనెల 20న సారవకోట మండలం మహసింగి గ్రామంలో స్పందన నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉదయం 10గంటల నుంచి 2గంటల వరకు స్పందన నిర్వహిస్తున్నామని, గ్రామస్తులు తమ సమస్యలను విన్నవించుకోవచ్చని పేర్కొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సోంపేట: మండలంలోని బేశి రామచంద్రపురం రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షకులు రైతులకు అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్ సత్యనారాయణ, యాంకర్ కుమారీ రైతులకు విత్తన గుళికలపై అవగాహన కల్పించారు. ఏయే పంటలను విత్తన గుళికల పంటగా తీసుకోవచ్చో అవగాహన కల్పించారు.

వసతిగృహ విద్యార్థులకు పరామర్శ

టెక్కలి రూరల్ : టెక్కలి మండలం పోలవరం బాలుర వసతి గృహంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులను కిల్లి రామ్మోహనరావు గురువారం పరామర్శించారు. పేరు పేరున అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో విద్యార్థులకు అందజేస్తున్న భోజనం, మెనూ అంశాలను పరిశీలించారు. వారికి పౌష్టికాహారం, మందులు అందజేసి త్వరగా కోలుకునేలా చూడాలని వసతిగృహ అధికారులను కోరారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శశిధర్

జ్వరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని కపాసుకుద్ది గ్రామంలో రాజపురం పిహెచ్‌సి ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ కె.శశిధర్ రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ జ్వరాలు వస్తున్నాయని, ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సామాజిక పరిశుభ్రత పాటించాలని సూచించారు. ముఖ్యంగా సమూహాల్లో ఉన్నప్పుడు మాస్క్ తప్పనిసరిగా ఉపయోగించాలని, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలతో పాటు గ్రామాల్లో ముమ్మరంగా క్లోరినేషన్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీ హెచ్‌ఇఒ అభిమన్యు సోయి, హెచ్‌వి భారతి, కేశవరావు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ చంద్రకుమారి

సర్వే వేగవంతం

మెళియాపుట్టి: ఎస్‌టిటి సర్వేలో గర్భిణులు, బాలింతలు, పుట్టిన పిల్లల ఆధార్ న్యూట్రిషన్ సర్వే నిర్వహించాలని ఎంపిడిఒ పి.చంద్రకుమారి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్, యూనిఫాం తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఈ నెల 23లోగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని చెప్పారు. ఎంపిడిఒ ఎఇ తిరుపతి పట్నాయక్, కార్యదర్శులు పాల్గొన్నారు.

బిఎస్‌పి జిల్లా అధ్యక్షులుగా నారాయణరావు

టెక్కలి: బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా బోకర నారాయణరావు ఎంపికయ్యారు. ఎపి దళిత మహాసభ జిల్లా అధ్యక్షులుగా ఉన్న ఈయనను బిఎస్‌జి జిల్లా అధ్యక్షులుగా రాష్ట్ర అధ్యక్షులు పరమజ్యోతి, రాష్ట్ర కో-ఆర్డినేటర్ రామారావు ఎంపిక చేశారు. ఈయన ఎంపికపై పలు సంఘాల నాయకులు హర్షం తెలిపారు.

కొత్తూరులో పారిశుధ్య పనులు

కొత్తూరు : మండల కేంద్రమైన కొత్తూరులోని కుమ్మరివీధి, పడలవీధి, గొడగలవీధి, బిసి కాలనీ, రాజా వీధుల్లో సర్పంచ్ పడల కృష్ణవేణి ఆధ్వర్యాన గురువారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లోని చెత్తా చెదారాలను పారిశుధ్య కార్మికులు తొలగించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్‌యార్డుకు తరలించారు. అనంతరం బ్లీచింగ్ జల్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువల్లో చెత్తా చెదాలను వేయవద్దని ప్రజలను కోరారు. కార్యక్రమంలో గోవిందరావు పాల్గొన్నారు.

పూడికలను తీస్తున్న పారిశుధ్య కార్మికులు